# అభివృద్ధిని చూసి ఆదరించండి

- ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి
- కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- యువతకు స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కొత్తపేటలో కారు గుర్తుకు ఓటేయాలని కోరుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### ప్రతి ఇంటికీ నీళ్లిచ్చావ్.. 'కారు' గెలుస్తుంది..



హన్వాడ మండలంలోని దచ్చక్‌పల్లి గ్రామంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రచారం చేస్తుండగా.. వృద్ధురాలు గౌరమ్మ మైక్ తీసుకొని మాట్లాడారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భూములు, పంటలకు రకం(కిస్తు) కట్టేవాళ్లం. తెలంగాణ వచ్చిన తరువాత పంట పెట్టుబడితోపాటు ప్రతి ఇంటికీ నల్లాలతో తాగునీళ్లు ఇస్తున్నారు. గతంలో డబ్బులు పెట్టి నీళ్లు కొనుక్కునేవాళ్లం. లేదంటే పొలాల వద్దకు వెళ్లి తెచ్చుకునేవాళ్లం. మీరు మాకోసం ఎంతో చేశారు. మళ్లీ కారు గుర్తే గెలుస్తుంది. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశావ్. నువ్వు చల్లగా ఉండాలి బిడ్డా..' అని గౌరమ్మ తెలిపారు.

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 31 : బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ క్యాంప్ కార్యాలయంలో వీహెచ్‌పీకి చెందిన గుబ్బ భరత్, రాఘవేంద్రగుప్తా, రామేశ్వర్, ప్రమోద్, శ్రీనివాస్, చంద్రశేఖర్, 37వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులు, మనిస్వామి, కుమార్, అంజి, వెంకటేశ్, మన్యంతోసహా 50 మంది.., హన్వాడ మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు రాములు, కేశవులు, ఆనంద్, తిరుపతయ్య, శ్రీను, కల్యాణ్, బోయ వెంకటయ్య, పుల్లయ్య, నర్సింహులు, లక్ష్మయ్య, యాదయ్య, అంజయ్యతో సహా 50 మంది మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

**కారు గుర్తుకు ఓటేయాలి..**

హన్వాడ, అక్టోబర్ 31 : గ్రామాల్లో చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేసి ఆదరించాలని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మండలంలోని కొత్తపేట, దచ్చక్‌పల్లి, వెంకటమ్మకుంట తండాలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మంత్రికి ఆయా గ్రామాల్లో డప్పుచప్పుళ్లు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుబీమా మాదిరిగా రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ కేసీఆర్ బీమా వర్తింపజేస్తామన్నారు. సౌభాగ్యలక్ష్మి కింద అర్హులైన ప్రతి మహిళకూ నెలకు రూ.3 వేల భృతి అందిస్తామన్నారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు. రూ.5లక్షల ఆరోగ్యశ్రీ నిధిని రూ.15 లక్షలకు పెంచుతామని, రేషన్ దుకాణాల ద్వారా ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిచనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతి గ్రామంలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎంతో మందికి సీఎం సహాయనిధి ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతున్నదన్నారు. కొత్త, పాత నాయకులు తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండి బీఆర్‌ఎస్ గెలుపునకు పని చేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అనంతరం దచ్చక్‌పల్లి గ్రామంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు రామిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు కృష్ణయ్యతోపాటు 30 మంది నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, రమణారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, సర్పంచులు చెన్నమ్మ, రాములు, బాలకిష్టారెడ్డి, ఎంపీటీసీ అరుణ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ వెంకటయ్య, నాయకులు కృష్ణయ్యగౌడ్, లక్ష్మయ్య, జంబులయ్య, శేఖర్, బాలయ్య, యాదయ్య, నరేందర్, హరిచందర్, చెన్నయ్య, సత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిరంతరం సేవ చేస్తా..**

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 31 : ప్రజలకు నిరంతరం సేవ చేస్తానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని 15వ వార్డు పరిధిలో ఉన్న చిన్నదర్పల్లి, లక్ష్మణ్‌లీలానాయక్ తండా, లచ్చిరాంతండా, పూజారి తండా, చిరుమల్‌కుచ్చతండాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రికి కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నదర్పల్లి పక్క నుంచి బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్నాయని, హన్వాడలో ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ఫుడ్, ఐటీ పార్కుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మాకు కులం, మతం, పార్టీతో సంబంధం లేదని, ఎవరైనా ఆపదలో ఉంటే సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు అధికారమిస్తే బజారు పాలే..

- టికెట్లు అమ్ముకుంటున్న హస్తం పార్టీ
- ఓటు రాజకీయాలు చేయడమే వారి వంతు
- మళ్లీ బీఆర్‌ఎస్ సర్కారుదే విజయం
- జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

జడ్చర్ల, అక్టోబర్ 31 : కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక స్థాయిలోనే టికెట్లు అమ్ముకుంటున్నదని, ఇక వారికి అధికారమిస్తే రాష్ట్రాన్ని బజారులో పెట్టి విక్రయించే పరిస్థితి నెలకొంటుందని బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్లలోని చంద్రాగార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి ఉండదని, కేవలం ఓటు రాజకీయం మాత్రమే తెలుసన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట మోసం చేస్తుందన్నారు. అధికారంలోకి వస్తే 3 గంటలు కరెంటు ఇస్తామని ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి మోసపోయామని కర్ణాటకలో రైతులు రోడ్ల మీదకు వస్తున్నారన్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్‌ను ఎన్నికల ప్రచారానికి పిలిస్తే.. మా వద్ద 5 గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నామని చెప్పారన్నారు. వారి మాటలు వింటే గోసతప్పదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రజారంజకంగా ఉందన్నారు. రైతుబీమా తరహాలో తెల్లరేషన్ కార్డు దారులకు కేసీఆర్ బీమా పథకాన్ని అమలు చేస్తామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.3వేలు ఇస్తామన్నారు. హామీలన్నీ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని ప్రజలు గుర్తించారని, మూడోసారి బీఆర్‌ఎస్ విజయం తథ్యమని దీమా వ్యక్తం చేశారు. అందరం కలిసికట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అనుచరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, సంగీత, నాటక అకాడమి మాజీ చైర్మన్ శివకుమార్, ముడా డైరెక్టర్ రవిశంకర్, ఇంతియాజ్, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, జ్యోతి, దేవ, న్యాయవాది జంగయ్య, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**'సర్దార్' జీవితం స్ఫూర్తిదాయకం..**

జడ్చర్లటౌన్, అక్టోబర్ 31 : సర్దార్ వల్లభాయ్ పటేల్ సిద్ధాంతాలు, జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. జడ్చర్లలో సర్దార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వల్లభాయ్ పటేల్ యువజన సంఘం సభ్యులు ఉన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు..**

నవాబ్‌పేట, అక్టోబర్ 31 : మండలంలోని కిషన్‌గూడ, గుబ్బడిగుచ్చతండాకు చెందిన లక్ష్మణ్, రూప్లా, సామ్య, ఎల్లయ్యతోపాటు 10 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, నరేశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**కల్లబొల్లి మాటలు నమ్మొద్దు..**

బాలానగర్, అక్టోబర్ 31 : కాంగ్రెస్ నేతల కల్లబొల్లి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, ప్రజా సంక్షేమం కోసం పనిచేసే బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఎక్వాయపల్లిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. చెన్నంగులగడ్డతండాలో కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. నేరళ్లపల్లి ఉర్సులో ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమాలలో టీజీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ కల్యాణి, నాయకులు లక్ష్మణ్‌నాయక్, జగన్‌నాయక్, శ్రీనివాసరావు, గోపాల్‌రెడ్డి, మంజునాయక్, సర్పంచులు తదితరులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

# కాంగ్రెస్‌వి హత్యా రాజకీయాలు

- బీఆర్‌ఎస్ హయాంలోనే శాంతియుత వాతావరణం
- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట, అక్టోబర్ 31 : రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసి.. ఆర్థికంగా అస్థిరపరిచి కాంగ్రెస్ పార్టీ రాజకీయ పబ్బం గడుపుకొంటున్నదని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో సౌమ్యుడిగా పేరు పొంది, రెండు సార్లు ఎంపీగా గెలుపొందిన కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పచ్చటి తెలంగాణను చూసి ఓర్వలేక కంటగంపుతో కాంగ్రెస్ తన ట్రేడ్ మార్క్ రాజకీయాలకు తెరతీసిందన్నారు. ప్రతిపక్ష నేతలు రేవంత్‌రెడ్డి, బండి సంజయ్, అరవింద్, ఈటల రాజేందర్ మాటలు, చేతలు ఏమాత్రం బాగాలేవని, ఈ విద్వేష ధోరణి సమాజాన్ని విషపూరితం చేస్తుందన్న విషయాన్ని సీఎం కేసీఆర్ అనేక మార్లు చెప్పారన్నారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్న కాంగ్రెస్‌కు అది అందని ద్రాక్షేనన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ విజయం తథ్యమని సర్వేలు ముక్తకంఠంతో చెప్పడం, టికెట్ల అమ్మకాలతో పార్టీ రచ్చరచ్చగా మారడం, అసలైన నాయకులు పార్టీని వీడి వెళ్తుండడంతో రేవంత్‌రెడ్డి బ్యాచ్‌కు ఓటమి తప్పదని అర్థమై హత్యారాజకీయాలకు తెరలేపిందన్నారు. కాంగ్రెస్ కుటిల రాజకీయాలు రాష్ట్రాన్ని కబలించకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

**ఎంతో ప్రగతి సాధించాం..**

నారాయణపేటను జిల్లాగా మారడంతో ఇప్పటివరకు ఎంతో ప్రగతి సాధించామని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో పాదయాత్ర చేపడుతూ ప్రచారం చేశారు. ప్రతి దుకాణాదారుడి వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారిని విస్తరించడంతో వ్యాపారాలు చేసుకునేందుకు సౌలభ్యం ఏర్పడిందన్నారు. త్వరలో మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు కానున్నాయన్నారు. తొమ్మిదేండ్ల పాలనలో పట్టణ ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విఠల్‌రావు ఆర్య, గందె చంద్రకాంత్, పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీపాద్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జగదీష్, కౌన్సిలర్ గురులింగం, మహేశ్, నాయకులు శివరాంరెడ్డి, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

**అడుగడుగునా స్వాగతం..**

దామరగిద్ద, అక్టోబర్ 31 : మండలంలోని బాపన్‌పల్లి, క్యాతన్‌పల్లి, కంసాన్‌పల్లి, వత్తుగుండ్ల గ్రామాల్లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. బాపన్‌పల్లిలో ఎమ్మెల్యేను యువ నాయకుడు రఘు గజమాలతో సత్కరించారు. కంసాన్‌పల్లిలో మహిళలు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ అధ్యక్షుడు ఈదప్ప, సర్పంచులు పాల్గొన్నారు.



సీఎం సభావేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

# 6న మక్తల్‌కు సీఎం కేసీఆర్

- ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి
- కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధిని గెలిపించాలి : ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్‌టౌన్, అక్టోబర్ 31 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 6వ తేదీన మక్తల్‌కు సీఎం కేసీఆర్ రానున్నట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రజా ఆశీర్వాద సభకు జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ తేదీన తెలంగాణ అభివృద్ధి ప్రదాత, సీఎం కేసీఆర్ మక్తల్ సభకు హాజరవుతున్నారన్నారు. సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, లబ్ధిదారులు, అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రతి అంశాన్ని అమలుచేస్తామన్నారు. అర్హులైన వారికి రూ.400కే సిలిండర్, మహిళకు నెలకు రూ.3 వేల భృతి అందజేస్తామన్నారు. 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా'తో ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తామన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తామన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.